మావోయిస్టు మహిళా కమాండర్ లొంగుబాటు

వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

సుబేదారి, ఫిబ్రవరి 21 : మావోయిస్ట్ పార్టీ మహిళా కమాండర్ వంజెం కేషా అలియాస్ జెన్ని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఎదుట లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం హనుమకొండలోని కమిషనరేట్‌లో సీపీ వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా పామెడ్ మండలం రాసపల్లికి చెందిన వంజెం కేషా తండ్రి మావోయిస్టు పార్టీలో పనిచేసి, ప్రస్తుతం జైలులో ఉన్నాడు. బాల్యం నుంచి కేషా చైతన్య మహిళా నాట్య మండలిలో పనిచేసేది. 2016లో పామెడ్ లోకల్ స్క్వాడ్ కమాండర్ కమల ద్వారా పార్టీలో చేరింది. కొంతకాలం అక్కడ పనిచేసిన కేషా అబుజ్‌మడ్‌కు బదిలీ అయింది. 2022లో మావోయిస్టు ఏరియా సభ్యుడు రమేశ్‌ను వివాహం చేసుకుంది. 2024 ఏప్రిల్ నుంచి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కడారీ సత్యనారాయణ అలియాస్ కొసా ప్రొటెక్షన్ గ్రూప్ కమాండర్‌గా పనిచేస్తున్నది. మావోయిస్టు పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత, తెలంగాణ ప్రభుత్వం కల్పిస్తున్న పునరావస పథకాలకు ఆకర్షితురాలై కేషా లొంగిపోయినట్లు సీపీ తెలిపారు. కేషాపై పలు కేసులు, రూ.4లక్షల రివార్డు ఉన్నట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో వేగం పెంచాలి

గ్రేటర్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

వరంగల్, ఫిబ్రవరి 21 : గ్రేటర్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియలో వేగం పెంచాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శుక్రవారం కౌన్సిల్ హాల్‌లో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన పురోగతిపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన 30 మంది జూనియర్ అసిస్టెంట్లను ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు వినియోగించుకోవాలని సూచించారు. రోజు టీపీఎస్‌లు క్షేత్రస్థాయిలో 20 దరఖాస్తులు పరిశీలన పూర్తి చేయాలన్నారు. రోజు వారి పురోగతిని ఏసీపీలు పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్‌రెడ్డి, రజిత పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, ఫిబ్రవరి 21 : హనుమకొండ టౌన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ ఆపరేషన్ డీఈ డీ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల్లో భాగంగా కడిపికొండ సబ్ స్టేషన్ పరిధి కడిపికొండటౌన్, బోడగుట్ట, అయోధ్యాపురం ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధి విష్ణుపురి, జూబ్లీ మార్కెట్, సుబ్బయ్యపల్లి, సోమిడి ఏరియాలో ఉదయం 11 నుంచి 11.30 వరకు, తిరిగి సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు, మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధి టీపీ టెంపుల్, యునాని దవాఖాన, శ్రీనివాస కిడ్నీ హాస్పిటల్, న్యూరాయపుర, రాయపుర వాడ ఏరియాలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, కేయూ సబ్‌స్టేషన్ పరిధి మహాత్మానగర్, విజయగణపతి కాలనీ, వినాయక టెంపుల్ లేన్ ఏరియాలో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, బాలసముద్రం సబ్ స్టేసన్ పరిధి పద్మాక్షికాలనీ, రాజ్‌పుత్‌వాడ ఏరియాలలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

శివరాత్రికి వేయిస్తంభాల గుడిలో ప్రత్యేక ఏర్పాట్లు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21 : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈ నెల 25 నుంచి మార్చి ఒకటి వరకు జరిగే మహోత్సవాలకు వేయిస్తంభాల దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఆలయ ప్రధానార్చకుడు గంగు ఉపేంద్ర శర్మ శుక్రవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. ఈ మేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సతీశ్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పురావస్తుశాఖ, దేవాదాయశాఖ అధికారులు, ఈవో డీ అనిల్‌కుమార్‌తో సమావేశమై ఆలయంలో చేపట్టాల్సి పనుల గురించి చర్చించారు. శివరాత్రి సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ఉచిత పండ్లు పంపిణీ ఉంటుందని ఈవో అనిల్‌కుమార్ తెలిపారు.

ఉపాధిహామీ పనులు త్వరగా పూర్తి చేయాలి

పరకాల, ఫిబ్రవరి 21 : ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు అన్నారు. మండలంలోని నాగారం, లక్ష్మీపురం, పైడిపల్లిలో పౌల్ట్రీ షెడ్, క్యాటిల్ షెడ్, నర్సరీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరిలోపు పనులు పూర్తయితే మార్చిలో బిల్లులు చెల్లిస్తామన్నారు. ఎంపీవో ఇందిర, ఈసీ రజినీకాంత్, కార్యదర్శులు రిజ్వానా, దినేశ్, టీఏలు నాగరాజు, సుమలత, ఎఫ్ఏలు కోమల, చిరంజీవి పాల్గొన్నారు.

'హైర్ బస్సులకు ఫ్లోర్ రేట్ కట్టించాలి'

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21 : అలంకార్ సెంటర్ వద్ద డ్రైనేజీ పనులు జరుగుతున్నందున రూట్ డైవర్షన్ చేయడంతో అదనంగా తిరుగుతున్న హైర్ బస్సులకు ఫ్లోర్ రేట్ కట్టించి, హెచ్ఎస్‌డీ ఆయిల్ టాప్‌అప్ చేయించాలని డీఎంలను హైర్‌బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు మారెపల్లి రామిరెడ్డి కోరారు. వరంగల్ రీజియన్ పరిధిలోని అన్ని డిపోల నుంచి హనుమకొండ బస్టాండ్‌కు నిత్యం హైర్‌బస్‌లు తిరుగుతున్నాయని డైవర్షన్‌తో ప్రతి ట్రిప్పుకు 8 కి.మీ. పెరిగిందని తెలిపారు. దీంతో హెచ్ఎస్‌డీ ఆయిల్ కన్జప్షన్‌లో తేడా వస్తుందని సమస్యను పరిష్కరించాలని కోరారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
*I OOKANTI SAMBA REDDY (New Name) H.No. 1-120, Tirumalagiri (V), Regonda (M), Jayashankar Bhupalpally Dist. T.G., Have changed my name from OOKANTI SAMBAIAH to OOKANTI SAMBA REDDY S/o OOKANTI MUKUNDA REDDY.
NTW-000

CHANGE OF NAME
*I, SAMPATH KUMAR (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda-Dist-500001, T.S. have changed my name from SAMPATH KUMAR to THALLA SAMPATH KUMAR(New Name) S/o. TALLA VARDARAJULU for all purposes.
NTW-5528

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHANGE OF NAME
*I, VARSHINI (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda Dist-506001, T.S have Changed my name from VARSHINI to THALLA VARSHINI DHANALAXMI (New Name) W/o. THALLA SAMPATH KUMAR for all purposes.
NTW-5528

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

'భద్రకాళీ' మట్టిని సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ, ఫిబ్రవరి 21 : భద్రకాళి చెరువు పూడికతీత మట్టిని పొలాలను సారవంతం చేసుకునేందుకు రైతులు, ఇటుకల తయారీకి బట్టీల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య సూచించారు. శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో చెరువు పూడికతీత మట్టి తరలింపు, తదితర అంశాలపై బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, హనుమకొండ, వరంగల్ జిల్లాల అదనపు కలెక్టర్లు ఏ వెంకట్‌రెడ్డి, సంధ్యారాణితో కలిసి సమీక్షించారు. ఇప్పటి వరకు చెరువు పూడిక ఎంత తీశారు? రోజుకు ఎంత తరలిస్తున్నారు? మట్టి నాణ్యత, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సాగునీటి పారుదల శాఖ ఈఈ శంకర్ మాట్లాడుతూ భద్రకాళీ చెరువులో ఇప్పటి వరకు 4.60లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తీసుకెళ్లేందుకు దరఖాస్తు చేశారని, ఈ నెల 28 వరకు గడువు ఉన్నందున మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. అనంతర కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భద్రకాళీ చెరువు పూడికతీత మట్టిని తరలించేందుకు రూట్ సర్వేను రేపటికల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. మట్టి తరలింపు సందర్భంగా చెక్ పోస్టును ఏర్పాటు చేసి అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. చెరువు మట్టి కావాలనుకునే రైతులు, ఇటుక బట్టీల యజమానులు ఇరిగేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్, కుడా పీవో అజిత్ రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి, సీఐ సీతారెడ్డి, మున్సిపల్ డీఈ సంతోష్, మైనింగ్, రవాణా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

మహిళా సాధికారత దిశగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం, మ్యానుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రణాళికతో ఏర్పాటు చేయాలని హనుమకొండ కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో డీఆర్డీఏ, వీ-హబ్ అధికారులతో దామెర మండలం ల్యాదెల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న పరకాల స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ఏర్పాటుపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రావీణ్య మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ పరిధిలోని మహిళా గ్రూపులకు శిక్షణ అందించేందుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి కేంద్రంలో శిక్షణానంతరం మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్స్ నెలకొల్పడానికి ఉన్న అవకాశాలను వీ-హబ్ సహకారంతో అంచనా వేసి, పరిశీలించిన అంశాలను కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో డీఆర్డీవో మేన శ్రీను, వీ-హబ్ డైరెక్టర్ జాహిద్ షేక్, అసోసియేట్ డైరెక్టర్ ఊహా సజ్జ, అధికారులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మార్చి 5 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 39,980 మంది విద్యార్థుల కోసం మొత్తం 55 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి గోపాల్, డీఈవో వాసంతి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేశ్, ఏసీపీ దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి సీఈవో సుదర్శన్‌రెడ్డి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రాథమిక సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి పాసులు జారీ చేశామని, రెండు దఫాలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి, పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూస్తున్నామని చెప్పారు. అదేవిధంగా పోలింగ్ బాక్స్‌లు తరలించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

నాటక పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

రేపటి నుంచి నాటక పోటీలు

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21 : తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, రాష్ట్ర చలనచిత్ర రంగస్థల అభివృద్ధి సంస్థల సౌజన్యంతో తెలుగుభాష ఆహ్వాన నాటిక పోటీలు-2025 నిర్వహించనున్నట్లు వరంగల్ సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ప్రతినిధులు గిరిజా మనోహర్‌బాబు, వనం లక్ష్మీకాంతా రావు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ఈ పోటీలు ఈ నెల 23, 24, 25 తేదీల్లో కాళోజీ కళాక్షేత్రంలో జరుగుతాయని తెలిపారు. గతంలో సరైన వేదికలు లేక ఆర్ఈసీ, కేఎంసీ, నందన గార్డెన్స్, నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో నిర్వహించే వాళ్లమని, ఇప్పుడు కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వరంగల్ కవులు, కళాకారులు, సాహితీవేత్తలు కుటుంబాలతో విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవీ నరసింహారావు, పీ లక్ష్మణరావు పాల్గొన్నారు.

'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్'తో పరిశోధన వనరులు : కేయూ రిజిస్ట్రార్

మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రాంచంద్రం

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21: 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' ద్వారా అందరికీ అందుబాటులో పరిశోధన వనరులు ఉంటాయని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం అన్నారు. కేయూ సెనేట్‌హాల్‌లో 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' అంశంపై శుక్రవారం జరిగిన ఒక రోజు జాతీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ విధానంలో పరిశోధన అడ్డంకులు తొలగి, పరిశోధనలు, విజ్ఞాన సముపర్జనకు దోహదపడుతుందన్నారు. బెంగళూర్ ఇన్ఫర్మేషన్ అండ్ లైబ్రరీ నెట్‌వర్క్ సంచాలకులు దేవికా పీ మడాలి మాట్లాడుతూ గతంలో చాలా విలువైన జర్నల్స్ కొద్దిమంది పరిశోధకులకు మాత్రమే అందుబాటులో ఉండేవన్నారు. సదస్సులో విశ్వవిద్యాలయ డీన్‌లు ప్రొఫెసర్ టీ మనోహర్, జీ హనుమంతు, పీ అమరావేణి, జీ సమ్మయ్య, ఎం శ్రీనివాస్ మాట్లాడారు. కన్వీనర్ డాక్టర్ ఎస్ సుజాత, లైబ్రరీ అసిస్టెంట్ తేజావత్ జావేర్ పాల్గొన్నారు.

వైద్యులు సమయపాలన పాటించాలి

వృద్ధురాలితో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

నయీంనగర్, ఫిబ్రవరి 21 : వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, నిబద్ధతతో సేవలందించాలని హనుమకొండ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం పూరిగుట్ట బస్తీ దవాఖాన, వడ్డెపల్లి యూహెచ్‌సీలను ఆయన తనిఖీ చేసి అక్కడ సేవలందిస్తున్న తీరును, రికార్డులను పరిశీలించారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు ల్యాబ్ పరీక్ష నిమిత్తం పంపిస్తున్న శాంపిల్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. రిపోర్టులను పరిశీలించి తగిన చికిత్స అందించాలని, అవసరమైతే సంబంధిత రెఫరల్ దవాఖానకు పంపించి ఫాలోఅప్ చేయాలని సూచించారు. అనంతరం అక్కడే ఉన్న ట్రస్టును సందర్శించి వారికి అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్లు హరిత, మాలిక, అశోక్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

హనుమకొండ చౌరస్తా, ఫిబ్రవరి 21 : కేయూలో పనిచేస్తున్న బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి కేయూ బోధనేతర కాంట్రాక్ట్ ఉద్యోగ సంఘాల జాక్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో వినతిపత్రం అందజేశారు. 30 ఏళ్ల నుంచి పని చేస్తూ రెగ్యులరైజ్ కాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు పొడిచెట్టి విష్ణువర్ధన్, నాగుల శివప్రసాద్, రాయికంటి సురేశ్‌కుమార్, శాగంటి శ్రీనివాస్, కొడవటిగంటి దయాకర్, రాజమౌళి, సూదయ్య పాల్గొన్నారు.

పెట్టుబడిదారీ వ్యవస్థకు కాలం చెల్లింది

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండ, ఫిబ్రవరి 21 : పెట్టుబడి దారీ వ్యవస్థకు కాలం చెల్లిందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు అన్నారు. కమ్యూనిస్టు ప్రణాళికా రెడ్ బుక్‌డే విడుదల సందర్భంగా శుక్రవారం బాలసముద్రంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. ప్రపంచంలో మతోన్మాదులు మూఢ నమ్మకాలను పెంచి పోషిస్తున్నారన్నారు. సైన్స్, భౌతికవాదాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అనంతరం కమ్యూనిస్టు ప్రణాళిక పుస్తకాలు, పార్టీ సాహిత్యాన్ని కార్యకర్తలకు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లెరు వీరస్వామి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మునగాల భిక్షపతి, నాయకులు బత్తిని సదానందం, వేల్పుల సారంగపాణి, కొట్టెపాక రవి, కండె నరసయ్య, సుదర్శన్, వెంకటరాజం, అనురాధ పాల్గొన్నారు.

లక్ష్యంతో చదువుకోవాలి

పరకాల, ఫిబ్రవరి 21 : విద్యార్థులు లక్ష్యంతో చదువుకోవాలని మోటివేషినల్ స్పీకర్ కజాంపురం దామోదర్ అన్నారు. మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(ఆత్మకూరు)లో శుక్రవారం సంస్కార వికాస శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదువుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ వీరలక్ష్మి, సీనియర్ సిటిజన్స్ తేరాల యుగంధర్, తాడూరి లక్ష్మీనారాయణ, రిటైర్డ్ టీచర్ రామన్న, ప్రభాకర్, నర్సింహారాములు, వెంకన్న పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు

మడికొండ, ఫిబ్రవరి 21 : మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా వికారాబాద్‌లో నిర్వహించనున్న సబ్ జూనియర్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు ఎల్ హరీశ్, ఎం మనోజ్ , సందీప్ , రాహుల్ ఆడనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులను వైస్ ప్రిన్సిపాళ్లు వీరాచారి, బీ రాజు, పీడీ రమేశ్, పీఈటీ నిరంజన్ తదితరులు అభినందించారు

పాత కక్షలతో కత్తులతో దాడి

ముగ్గురికి తీవ్రగాయాలు

హసన్‌పర్తి, ఫిబ్రవరి 21 : పాత కక్షలు దృష్టిలో పెట్టుకొని కత్తులతో దాడి చేయగా ముగ్గురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని మడిపల్లిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. మండలంలోని మడిపల్లిలో జరిగిన సమీప బందువుల వివాహ వేడుకలకు భీమదేవరపల్లి మండలం గట్ల నర్సింగాపూర్‌కు చెందిన పల్లపు అన్వేశ్, రమేశ్, కనుకయ్య కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అలాగే, మడిపల్లికి చెందిన వరుసకు బావ, బావమరిది అయిన క్రాంతి, నరేశ్ ఇంటికి వెళ్లారు. వీరి మధ్య కొంత కాలంగా పాత కక్షలు ఉండడంతో ఒకరికొకరు తిట్టుకుంటూ ఇరు కుటుంబాల సభ్యులు గొడవకు దిగారు. దీంతో ఆవేశంతో ఉన్న క్రాంతి, నరేశ్, జలేందర్ బావలైన రమేశ్, అన్వేశ్, కనకయ్యపై కత్తులతో దాడి చేశారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా వెంటనే ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు క్రాంతి, నరేశ్, జలేందర్, రజితపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి తీవ్రగాయాలు

కమలాపూర్, పిబ్రవరి 21: మండలంలోని వంగపల్లి శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని నాంపల్లి మహేశ్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామక్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మహేశ్ సుతారి పనుల కోసం శుక్రవారం మర్రిపెల్లిగూడెం గ్రామానికి వచ్చాడు. అతడి భార్య పిల్లలకు ఆరోగ్యం బాగలేకపోవడంతో పరకాల దవాఖానకు వెళ్లారు. వారు ఫోన్ చేయడంతో పరకాలకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. వంగపల్లి శివారులోకి రాగానే అతడి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మహేశ్ తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మడికొండ, ఫిబ్రవరి 20 : ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటనపై మడికొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. మడికొండకు చెందిన దాసరి సంపత్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో మద్యం సేవించి, అనంతరం ఎలుకల మందు తాగాడు. విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడి కుమారుడు రాహుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్రేన్ ప్రమాద ఘటనలో మరొకరు..

వెంకటయ్య(ఫైల్)

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని గట్లనర్సింగాపూర్‌లో గురువారం వ్యవసాయ బావి పూడిక తీస్తుండగా ప్రమాదవశాత్తు క్రేను పడిన ఘటనలో గండికోట ఎల్లయ్య అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రంగా గాయపడిన వేల్పుల వెంకటయ్య(52) వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఏడు మేకల సంపత్‌కు చెందిన బావిలో పూడిక తీస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

కొప్పూరులో సభీపై అవగాహన

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 21 : మండలంలోని కొప్పూరు గ్రామంలో శుక్రవారం సభీ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, యూత్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభీ సెంటర్ ఉద్దేశాలు, అందిస్తున్న సేవల గురించి అడ్మిన్ హైమావతి వివరించారు. కార్యక్రమంలో కేస్ వర్కర్ అనూష, ఏపీఎం దేవానంద్, వీవోఏ అరుణ, మహిళలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే గండ్రపై బురద జల్లే ప్రయత్నం మానుకోవాలి

అంబేద్కర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట, ఫిబ్రవరి 21 : భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్